విశాఖపట్టణం
శుక్రవారం 14 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:202 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు
# పాక్ అండ

పాక్‌వైపు కన్నెత్తితో భారత్

సర్వనాశనం తప్పదు

అవామీ ముస్లిం లీగ్

నాయకుడు షేక్ రషీద్

అహ్మద్ ప్రేలాపన

2






# జైల్లో నన్ను అవమానించారు

గ్రిల్స్ వెనుక నిలబెట్టి ఫోటోలు తీయించారు

సిబ్బందిని ప్రశ్నిస్తే.. పై నుంచి ఆదేశాలు అంటున్నారు

మాజీ సీఎంని అనే జ్ఞానం కూడా లేదా

చంద్రబాబు చౌకబారు రాజకీయాలకు నిదర్శనం

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆగ్రహం

కర్నూలు జైలులో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షికి పరామర్శ

(కర్నూలు - జయజయహే)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలులో పర్యటించారు. జైలులో ఉన్న తన పార్టీ ఎమ్మెల్యేను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్ కూటమి పాలనపై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై సీరియస్ కామెంట్స్ చేశారు. జైలులో తనను కూడా అవమానించేలా ఆదేశాలు ..మిగతా 2లో

# రాజధానిలో చారిత్రక ఘట్టం

సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రారంభం

స్టీల్ బ్రిడ్జిల శిలాఫలకాలను ఆవిష్కృతం

ప్రజాప్రతినిధుల క్వార్టర్స్ కు శ్రీకారం

ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మిస్తాం

ముఖ్యమంత్రి

చంద్రబాబు నాయుడు వెల్లడి






(అమరావతి - జయజయహే)

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ఆర్థిక పురోగతికి అమరావతి రాజధాని నగర నిర్మాణమే తొలి విజయ సోపానమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అంతకుముందు సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విభజన గాయాల నుంచి కోలుకుని, భూములిచ్చిన రైతుల త్యాగాల పునాదులపై నిర్మితమవుతున్న అమరావతి ఇకపై ఏ శక్తుల వల్లా ఆగదని, ప్రపంచ అత్యుత్తమ నగరాల సరసన నిలుస్తుందని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో రాజధాని నిర్మాణానికి కీలక మలుపు జరుగుతుందన్నారు. మూడో దశలో తాడేపల్లి వద్ద జాతీయ రహదారితో అనుసంధానం అవుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీగా రూపాంతరం అమరావతి చెందనుందన్నారు. 2028 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రపంచ స్థాయి రాజధానిగా ప్రారంభోత్సవం అవుతుందన్నారు.

భూములిచ్చిన రైతులకు చంద్రబాబు నమస్కరిస్తూ.. రాజధాని పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని వెల్లడించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రగతి కోసం ..మిగతా 2లో

# కుంకీ ఏనుగుల రాకతో అద్భుత ఫలితాలు

ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ లక్ష్యం

హనుమాన్ ప్రాజెక్టుతో విశేష ఫలితాలు

మానవ--వన్యప్రాణి సంఘర్షణ లేని జీవనం

ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం

ప్రపంచ ఏనుగుల దినోత్సవ సదస్సులో డీప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

(విశాఖపట్నం - జయజయహే)



మానవులు--వన్యప్రాణుల మధ్య సంఘర్షణ లేకుండా సహజీవనం సాగించే పరిస్థితులే నిజమైన అభివృద్ధికి సూచిక అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, కుంకీ ఏనుగుల వినియోగంతో రాష్ట్రంలో మానవ--ఏనుగుల ఘర్షణలను గణనీయంగా తగ్గించగలిగామని తెలిపారు. ప్రపంచ ..మిగతా 2లో




# ఎస్ఐఆర్ వేగవంతం చేయండి

నోటీసులు జారీ, విచారణ పూర్తి కావాలి

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి

కాలేజీల్లో క్యాంప్‌లు నిర్వహించాలి

కలెక్టర్లతో ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్

3



# ప్రజారోగ్యం పట్టదా?

అంతా ఆరోగ్యం ఉండటం మీకు ఇష్టం లేదా

కోర్టు ఆదేశాలను తేలిగ్గా తీసకుంటున్నారేం

ఒత్తిళ్లకు నిర్ణయాల అమలు వాయిదా వేస్తున్నారా

ప్రభుత్వ విధానాలను ఆహార తయారీదారులు నిర్ణయించలేరు

ఇదే ఆఖరి అవకాశం.. ఇకపై సహించం

ప్యాకేజ్డ్ ఉత్పత్తులు ముందుభాగంలో హెచ్చరికలు ముద్రించాల్సిందే

రెండు వారాల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలి

ఎఫ్ ఎస్ ఎస్ ఏఐ పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై ఆరోగ్య హెచ్చరిక లేబుళ్లు ముద్రించే అంశంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత నాణ్యత ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుసరిస్తున్న వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు ఉండే ప్యాకేజ్డ్ ఉత్పత్తుల ముందు భాగంలో హెచ్చరిక గుర్తులు ముద్రించడంపై రెండు వారాల్లోగా ..మిగతా 3లో

## డ్వాక్రా మహిళలకు
# బంపర్ ఆఫర్

ఎలక్ట్రిక్ ఆటో, బైక్‌లపై భారీ రాయితీ

మెప్మా ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు

మహిళల ఆర్థిక సాధికారతకు చేయూత... రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం




(అమరావతి - జయజయహే)

ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్న కూటమి సర్కార్.. తాజాగా వారికి ఉపయోగపడేలా మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బ్యాంకుల ద్వారా డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలను ప్రభుత్వం అందిస్తోన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ-ఆటోల కొనుగోలుకు కూడా బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీకి లోన్ ఇప్పించనుంది. అలాగే ప్రభుత్వం నుంచి ..మిగతా 2లో



# ఎర్రకోట ముస్తాబు

పంద్రాగస్టు వేడుకలకు రెడీ

వికసిత్ భారత్-2047 కోసం యువశక్తి'

థీమ్‌తో సంబరాలు

2


For a pure tomorrow..

# రాజధానిలో చారిత్రక ఘట్టం

మొదటి పేజీ తరువాయి...

పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుజాతి గర్వపడేలా సైబరాబాద్ నగర నిర్మాణం జరిగిందని, విభజన తర్వాత రాజధాని కూడా లేక ఏపీ తీవ్రంగా నష్టపోయిందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాలకు సరిగ్గా మధ్యలో ఉండే గుంటూరు జిల్లా పరిధిలో రాజధాని ఏర్పాటు చేయాలని సంకల్పించామని తెలిపారు. 'సుదీర్ఘ చర్చల తర్వాత ప్రభుత్వంపై నమ్మకంతో పవిత్రమైన రాజధాని నిర్మాణం కోసం తమ అమూల్యమైన భూములను త్యాగం చేసిన రైతులందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. సింగపూర్ బృహత్ ప్రణాళిక, లండన్‌కు చెందిన ప్రఖ్యాత నార్మన్ ఫాస్టర్స్ డిజైన్లతో అమరావతి కాంప్లెక్స్ భవనాలను యూనీక్‌గా రూపొందించాం. గతంలో కొందరు వీటిని గ్రాఫిక్స్ అని ఎగతాళి చేశారు. నేడు ఆ గ్రాఫిక్స్ నిజ రూపం దాలుస్తుంటే ఎగతాళి చేసిన వారంతా తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.' అని చంద్రబాబు అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా రాజధానికి 40 వేల ఎకరాలు కావాలని మద్దతు తెలిపిన వ్యక్తి, అధికారంలోకి వచ్చాక 'మూడు రాజధానులు' అని మాట మార్చడాన్ని ప్రజలు గమనించారని చంద్రబాబు విమర్శించారు. 2019-24 మధ్యకాలంలో రైతులు చేసిన అమరావతి ఉద్యమం చారిత్రాత్మకమైనదని, ఆ పోరాటానికి తాము కూడా జోలె పట్టి సహకరించామని సీఎం గుర్తు చేసుకున్నారు. అమరావతి కేవలం పరిపాలనా నగరమే కాకుండా, పూర్తిగా కాలుష్య రహిత డీప్ టెక్ క్యాపిటల్‌గా మారబోతోందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటర్ వ్యాలీగా ప్రపంచంలోనే




అగ్రగామి టాప్-5 నగరాల్లో ఒకటిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. అమరావతి, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని మహానగర పరిధిలోనే భాగమవుతాయన్నారు.

190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు చంద్రబాబు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలంతా చేతిలో జాతీయ జెండా, మనస్సులో నిర్దిష్టమైన అజెండాతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, వాణిజ్య సముదాయంపైనా త్రివర్ణ పతాకం ఎగరవేయాలన్నారు. 'అమరావతి నిర్మాణంలో సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిలు తొలి మెట్టు మాత్రమే. రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడే శక్తులతో అప్రమత్తంగా ఉంటూ, హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని సాధించడమే మన అందరి లక్ష్యం కావాలి.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# కుంకీ ఏనుగుల రాకతో అద్భుత ఫలితాలు

మొదటి పేజీ తరువాయి...



ఏనుగుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు చేపట్టిన అనంతరం మానవ--ఏనుగు సంఘర్షణలను తగ్గించడం పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మదపుటేనుగుల సమస్యను అధిగమించేందుకు కర్ణాటక రాష్ట్ర సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. వాటి సహకారంతో ఏజెన్సీ ప్రాంతాల్లో మంచి ఫలితాలు లభిస్తున్నాయని, ఇప్పటివరకు 15 కీలక కార్యకలాపాల్లో కుంకీ ఏనుగులు సహకరించాయని వెల్లడించారు. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం వరకు తగ్గాయని, పంటనష్టం కూడా గణనీయంగా తగ్గిందన్నారు. దేశంలో ఏనుగుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, 2014 నుంచి ఏనుగుల సంరక్షణ కేంద్రాల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందన్నారు. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్', కారిడార్ల రక్షణ, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు ఏనుగుల పరిరక్షణకు దోహదపడుతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 150 ఏనుగు కారిడార్లను గుర్తించడం ద్వారా వాటి సహజ ఆవాసాల పరిరక్షణకు బలం చేకూరిందన్నారు. కుంకీ ఏనుగుల ఏర్పాటులో సహకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అప్పటి అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య సహకారానికి నిదర్శనమే కాకుండా, ప్రజలు, ప్రకృతి--వన్యప్రాణుల పరిరక్షణకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఇప్పటికే శిక్షణ పొందిన 'జయంత్' అనే కుంకీ ఏనుగు పార్వతీపురం మన్యం జిల్లాలో సేవలందిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**హనుమాన్ ప్రాజెక్టుతో విశేష ఫలితాలు**

మానవ--వన్యప్రాణుల సంఘర్షణలను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2026 మార్చిలో 'హనుమాన్' (ఎ.నా.చీ.ఖ.వీ.నా.చీ.) ప్రాజెక్టును ప్రారంభించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. వేగవంతమైన స్పందన, సాంకేతిక పరిజ్ఞానం, నష్టం నివారణ చర్యల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలవుతోందన్నారు. ప్రాజెక్టు కింద 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కు పైగా జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, సమాజం కూడా భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రైతులు భయంలేకుండా వ్యవసాయం చేసుకునే పరిస్థితులు కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రజలు, వన్యప్రాణులు సురక్షితంగా సహజీవనం చేసే భవిష్యత్తు నిర్మాణమే అసలైన విజయమని అన్నారు.

**"ప్రాజెక్ట్ ఎలిఫెంట్ -- 30 జెయింట్ స్టెప్స్" పుస్తకావిష్కరణ**

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ రూపొందించిన "ప్రాజెక్ట్ ఎలిఫెంట్ -- 30 జెయింట్ స్టెప్స్" పుస్తకాన్ని కేంద్ర సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, వన్యప్రాణి శాస్త్రానికి సంబంధించిన పలు గ్రంథాలను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల సంరక్షణలో ప్రాణత్యాగం చేసిన ఒడిశాకు చెందిన అటవీ శాఖ అధికారి జుగల్ నాయక్‌కు "గజ గౌరవ్" అవార్డును ప్రదానం చేశారు. అలాగే ఏనుగుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యల్లో విశేష సేవలందించిన సిబ్బందిని ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, కేంద్ర--రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

# జైల్లో నన్ను అవమానించారు

మొదటి పేజీ తరువాయి...



ఇచ్చారని మండిపడ్డారు. మరో మూడేళ్లలో ప్రభుత్వం కూలిపోతుందని తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అప్పుడు కచ్చితంగా ఇంతకింతా అప్పగించాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని పోలీసులు ఈ మధ్య అరెస్టు చేసి కర్నూలు జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన రిమాండ్ ఖైదీగా జైల్లో ఉన్నారు. ఆయన్ని వైఎస్ జగన్ పర్యటించారు. ఆయనతో గంటకుపైగా ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఎమ్మెల్యే అరెస్టు చేసే క్రమంలో పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణంగా ఉందన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే వందల మంది పోలీసులను ఆయన ఇంటిపైకి పంపించారని కిటికీలు, తలుపులు పగలగొట్టి మరీ అరెస్టు చేశారని ఆరోపించారు. రెడ్‌బుక్ పాలనలో పోలీసులు బరి తెగిస్తున్నారని, ఎమ్మెల్యే ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడ్డారని జగన్ పేర్కొన్నారు. ఒక శాసనసభ్యుడి పట్ల ఇలా ప్రవర్తించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. కేవలం గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మొదటి కేసులో 34 మందిని, రెండో కేసులో 14 మందిని, మూడో కేసులో మరో 12 మందిని ఇరికించారని, మొత్తం 38 మంది వైసీపీ కార్యకర్తలను జైలుకు పంపించారని జగన్ వివరించారు. టీడీపీ కార్యకర్తలే దాడులు చేసి, తప్పును కప్పిపుచ్చుకోవడానికి తమపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టారని, ఒక సందర్భంలో టీడీపీ కార్యకర్తే తన భార్య బట్టలు చించేసి ఆ నేరాన్ని వైసీపీ నాయకులై నెట్టే ప్రయత్నం చేశారని జగన్ వీడియోలు చూపించారు. వైఎస్ జగన్ తన ప్రసంగంలో రెడ్ బుక్ అనే పదే పదే ప్రస్తావించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో నడుస్తోందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా బీసీ నాయకులను టార్గెట్ చేస్తున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. సీదిరి అప్పలరాజు, ముస్తాఫా, కారుమూరి సునీల్ వంటి నేతపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఇది చంద్రబాబు శాడిస్ట్ మెంటాలిటీకి నిదర్శనమని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని తమ గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జైలు లోపల ఎమ్మెల్యే విరూపాక్షితో ములాఖత్ సమయంలో తనను అవమానించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తనను కావాలనే జైలు గ్రిల్స్ వెనుక నిలబెట్టి, జైలు సిబ్బందితో ఫొటోలు తీయించారని ఆయన తెలిపారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నిస్తే, పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇలా చేస్తున్నామని సమాధానం ఇచ్చినట్టు జగన్ చెప్పారు. ఒక మాజీ ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా ఇలాంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎల్లకాలం చంద్రబాబు ప్రభుత్వమే ఉండదని ఈరోజు బాబు నాటిన తప్పుడు విత్తనాలే రేపు విషవక్షాలపై ఆయన్ని చుట్టుముడతాయని జగన్ హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ఆర్‌సీపీ నాయకులపై దాడులు పెరిగాయని ఆ పార్టీ ఆరోపిస్తోంది. గిరి అనే కార్యకర్తను ఎమ్మెల్యే తన కారులో ఎక్కించుకొని వెళ్తుండగా వారిపై దాడి జరిగిందని, ఆ దాడిలో ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాముల చెయ్యి విరిగిందని జగన్ వివరించారు. బాధితుల పక్షాన నిలబడితే కేసులు పెడతున్నారని, పోలీసు యంత్రాంగం కూడా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ఫిర్యాదులు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజాప్రతినిధులను అక్రమంగా నిర్బంధించడం ద్వారా గొంతు నొక్కలేరని జగన్ స్పష్టం చేశారు. విరూపాక్షికి ధైర్యం చెప్పామని పార్టీ మొత్తం ఆయనకు అండగా ఉంటుందని, న్యాయస్థానాల్లో, ప్రజా క్షేత్రంలో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.



## లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

## డ్వాక్రా మహిళలకు బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి...

భారీగా రాయితీ కూడా అందించనుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ-ఆటోను ప్రభుత్వం ప్రోత్సహించనుంది. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వారికి రాయితీలపై వీటిని అందించే ప్రొగ్రాంకు శ్రీకారం చుట్టింది.

**ఈ-ఆటోలపై భారీ రాయితీ**

డ్వాక్రా సంఘాలకు ఈ-ఆటోల కొనుగోలుపై భారీ రాయితీ ప్రభుత్వం కల్పిస్తోంది. అలాగే కాకుండా తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలతో పాటు సులభ వాయిదాల్లో వాటిని చెల్లించే సౌకర్యం కల్పించనుంది. దీంతో దీని ద్వారా లబ్ది పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మెప్మా అధికారులు చెబుతున్నారు. ఆసక్తి ఉన్న డ్వాక్రా సంఘాలు అప్లికేషన్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. గతంలో కొంతమంది దరఖాస్తు చేసుకోగా.. వారికి సబ్సిడీపై ఆటోలు అందించారు. ఇప్పుడు మరింతమందికి లబ్ధి చేకూర్చే ప్రయత్నాలను మెప్మా మొదలుపెట్టింది. ఈ-ఆటో విలువ రూ.4.5 లక్షలు ఉంటుంది. ప్రభుత్వం రూ.లక్ష రాయితీ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో రూ.3.5 లక్షలకు కొనుగోలు చేయవచ్చు. అయితే ఇందుకు బ్యాంక్ ద్వారా ప్రభుత్వం రుణం ఇప్పించనుంది. ఈ ఆటోలను డ్వాక్రా సంఘాలు లేదా వీరి కుటుంబసభ్యుల్లో ఎవరైనా నడిపించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో స్వయం ఉపాధి పొందవచ్చు.

**ఎలక్ట్రిక్ స్కూటర్లపై కూడా రాయితీ**

కొంతమంది ఆటోలను కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలను ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే ప్రైవేట్ నిర్వాహకులు అధిక వడ్డీని వసూలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం తక్కువ వడ్డీ రేటు, రాయితీలో వీటిని అందించనుంది. అలాగే మహిళలకు రాయితీపై ఎలక్ట్రిక్ స్కూటీలు కూడా అందిస్తున్నారు. ఎలక్ట్రికల్ స్కూటీ తీసుకుంటే రూ.12 వేల రాయితీ అందిస్తారు. అలాగే బ్యాంక్ రుణం కూడా అందిస్తారు. ఈ సదుపాయం పొందేందుకు మెప్మా అధికారులను సంప్రదించాలి. అర్హులైన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చాలామంది మహిళలు రాయితీపై వీటిని అందుకున్నారు. ఇప్పుడు మరింతమందికి అందించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోని మహిళలు ఎక్కువగా తీసుకుంటుండగా.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఈ ప్రయోజనాలను తీసుకోవడం లేదు.

## ఎర్రకోట ముస్తాబు

### పంద్రాగస్టు వేడుకలకు రెడీ

### వికసిత్ భారత్-2047 కోసం యువశక్తి' థీమ్‌తో సంబరాలు

**(అమరావతి - జయజయహే)**

దేశ రాజధానిలోని చారిత్రక ఎర్రకోటపై 80వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎగురవేయనున్నారు. ఈ ఏడాది 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు, వికసిత్ భారత్ఏ2047 కోసం యువశక్తి' థీమ్‌లతో ఎర్రకోట ముస్తాబైంది. చరిత్రలో తొలిసారిగా ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించనున్నారు. అలాగే జాతీయ పతాకావిష్కరణ వేళ వాయుసేనకు చెందిన వీఎ-17 హెలికాప్టర్ల ద్వారా పూలవర్షం కురిపించనున్నారు. జ్ఞానపథ్‌లో వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు కూర్చోనున్నారు. వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వివిధ రంగాలకు చెందిన దాదాపు 5 వేల మందికి అధికారులు ప్రత్యేక ఆహ్వానం పంపారు. వీఐపీ సంస్కృతికి స్వస్తి పలుకుతూ, భారతదేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లతో సీటింగ్ ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. మరోవైపు, పర్యాటకుల సౌకర్యార్థం ఉచిత మెట్రో ప్రయాణం, క్యూఆర్ కోడ్ ఈ-ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో చెత్త తొలగింపు కోసం 'స్వచ్ఛత ప్రచారం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

# విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

**- 'డయల్ యువర్ సీఎండీ'కు విశేష స్పందన**

**- 6 నెలల్లో 1,087 ఫిర్యాదుల్లో 1,046 పరిష్కారం**

**- ఫిర్యాదుల ఆధారంగా రూ.7.47 కోట్ల విలువైన 305 పనులు**

**- సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి**

**విశాఖపట్నం, ఆగస్టు 13, జయ జయహే**



వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఏపీఈపీడీసీఎల్ ప్రారంభించిన 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. "సమస్యలు విని, స్పందించి, పరిష్కరించాలి" అనే విధానానికి అనుగుణంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు పాడేరు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వినియోగదారుల సమస్యలను కేవలం స్వీకరించడమే కాకుండా, వాటి పరిష్కారం జరిగే వరకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతమైన సేవలను అందించడమే ఏపీఈపీడీసీఎల్ లక్ష్యమని స్పష్టం చేశారు. 2026 ఫిబ్రవరి 9న ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా గత ఆరు నెలల్లో 1,087 ఫిర్యాదులు అందగా, వాటిలో 1,046 ఫిర్యాదులను పరిష్కరించినట్లు సీఎండీ వెల్లడించారు. మిగిలిన ఫిర్యాదులను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను కేవలం నమోదు చేసి పరిష్కరించినట్లు చూపించడం కాకుండా, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో సాంకేతిక, మౌలిక సదుపాయాల మెరుగుదల పనులను చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల్లో ప్రధానంగా వోల్టేజ్, విద్యుత్ సరఫరాకు సంబంధించినవి 561, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్లకు సంబంధించినవి 173, స్తంభాలు, విద్యుత్ లైన్లు, డీటీఆర్‌లకు సంబంధించినవి 124, మీటరింగ్, బిల్లింగ్‌కు సంబంధించినవి 17, పరిహారానికి సంబంధించినవి 21, ఇతర ఫిర్యాదులు 191 ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల సంతృప్తి, నాణ్యమైన విద్యుత్ సరఫరా, వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కారం, పారదర్శకమైన సేవల ద్వారా ప్రజలకు మరింత చేరువగా, బాధ్యతాయుత విద్యుత్ పంపిణీ సంస్థగా ఏపీఈపీడీసీఎల్‌ను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సీఎండీ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ పై పాజిటివ్ పబ్లిక్ పరసెప్షన్ ను పెంపొందించేందుకు 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమం మరింత దోహదపడుతుందని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు.



## ఫేషియల్ అటెండెన్స్‌పై గిరిజనులు ఆగ్రహం

**హుకుంపేట: ఆగస్టు 13. జయ జయహే.**

అరకు నియోజకవర్గం పరిధిలోని ఉన్న హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ దారగడ్డ గ్రామంలో వీబీజి రాంజీ ఉపాధి హామీ పనిని ఫోన్ ఫేషియల్ అటెండెన్స్ విధానం తమకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, రోజువారి పనుల ను సకాలంలో పూర్తి చేస్తున్నప్పటికీ ముఖం హాజరు నమోదయ్యే వరకు పనులు ముగించుకొని ఇంటికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోయారు, హాజరు కోసం గంటల తరబడి వేచి ఉండటంతో కూలీలకు విలువైన సమయం వృధా అవుతుందని మరోవైపు రోజువారి కూలీ పనులకు కూడా నష్టం జరుగుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు, మారుమూల ప్రాంతంలో సంకేతిక నెట్వర్క్ సమస్యలు ఎదురవుతున్నప్పుడు పరిస్థితి మరింత ఇబ్బందికారంగా మారుతుందని తెలిపారు, గిరిజన ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని అధికారులు పున్నం సమీక్షించాలని వారు కోరారు, గతంలో మాదిరిగానే సులభతరమైన విధానంలో హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కూలీలకు సమయం ఆదాయం నష్టం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో రమేష్ సుబ్బారావు మంగలయ్య సూరిబాబు శ్రీను బాబురావు నాగేశ్వరరావు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు



## నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు క్రీడాకారులు ఘన విజయం

**జిల్లా జాయింట్ కలెక్టర్ అభినందనలు**

విజయవాడ ఈ నెల 3 వ తేది నుండి 5వ తేది వరకు జరిగిన నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారిణి రాజాన గంగోత్రిని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్. గంగోత్రికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.భవిష్యత్తులో గంగోత్రి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డెఫ్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు 3వ స్థానం మరోవైపు, డెఫ్ ఎనేబుల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలోని మొయినాబాద్ వద్ద గల జ్వాలా గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆగస్టు 3 నుండి 5 వరకు నిర్వహించిన 'నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఫర్ ది డెఫ్' టోర్నమెంట్‌లో విజయవాడ బధిర క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటారు. దేశంలోని ఏడు ప్రాంతీయ జట్లతో హోరాహోరీగా పోటీపడిన విజయవాడ జట్టు, కోర్టులో విశేషమైన అంకితభావం, చురుకుదనం ప్రదర్శించి ఓవరాల్ టీమ్ విభాగంలో 3వ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి బహుమతులు సాధించి తమ అసాధారణ ప్రతిభను నిరూపించుకున్న క్రీడాకారులను ఈ సందర్భంగా అభినందించారు.



## సెంట్రల్ క్రాఫ్ట్ ఫుడ్ బ్యాంక్‌ను పరిశీలించిన అధికారులు

**రాజమహేంద్రవరం: జయ జయహే:ఆగస్టు 13:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం కాకినాడ నుంచి ధవళేశ్వరం (ఓల్డ్ ఫారెస్ట్ సా మిల్ ప్రాంగణం)కు విచ్చేసి సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ధీరజ్ పాటిల్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రభాకర్, ధవళేశ్వరం సిఐ గణేష్ కలిసి కార్యక్రమం జరిగేప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, విఐపి రాకపోకలు, పార్కింగ్, ప్రజల సౌకర్యాలు, అత్యవసర సేవలపై అధికారులు సమీక్ష నిర్వహించారు.ఉప ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు అడిషనల్ ఎస్పీ ధీరజ్ పాటిల్ పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూరులో ఎంపీడీఓ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**జాతీయ జెండాలతో వేళ్ళు విరిసిన వీధులు...**

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగస్టు 14,**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈరోజు కొయ్యూరు మండల కేంద్రంలో ఎంపీడీఓ జీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మరియు భారీ తిరంగా ర్యాలీ అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీడీఓ, ప్రసాద్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొయ్యూరు ప్రధాన కూడలి నుండి ప్రారంభమై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. అందరూ చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని "భారత్ మాతా కీ జై", "వందేమాతరం", "జై హింద్" నినాదాలతో ర్యాలీ సాగింది. ఎంపీడీఓ జీడీవీ ప్రసాద్ మాట్లాడుతూ – "ప్రతి ఇంటిపై ఆగస్టు 13 నుండి 15 వరకు జాతీయ జెండా ఎగురవేసి, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుదాం" అని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని తెలిపారు. చివరగా అందరూ కలిసి జాతీయ గీతం ఆలపించడంతో కార్యక్రమం ముగిసింది.

## అల్లూరి జిల్లా బిఎస్‌పి ఇంచార్జ్ బోను కృష్ణ పర్యటన

**అరకులోయ: ఆగస్టు13. జయ జయహే.**



ఈనెల 17. 18 .19 తేదీన అల్లూరి జిల్లా బి ఎస్ పి పార్టీ జిల్లా ఇన్చార్జి ప్రధాన కార్యదర్శి బోను కృష్ణ పర్యటన, అల్లూరి జిల్లా అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థ ల ఎన్నికలలో బి ఎస్ పి పార్టీ పోటీ చేసే ఎంపిటిసి జడ్పిటిసి అభ్యర్థులకు పరిశీలిన చేసి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు, అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రాంతాలలో పర్యటించి గిరిజనులకు బి ఎస్ పి పార్టీ తరఫున అండగా నిల్వనున్నట్లు తెలిపారు, జిల్లాలోని బి ఎస్ పి పార్టీ కమిటీ సభ్యులు నియోజకవర్గ కమిటీ లు ఈ సమావేశానికి అరకు వేలి నందు హాజరు కాగలరని తెలిపారు,



## ప్రజారోగ్యం పట్టదా?

తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన పిటిషన్‌పై విచారణ జరిపింది. ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐ తరఫున హాజరైన అడిషనల్ సోలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్‌ను ధర్మాసనం నేరుగా నిలదీసింది. "ఈ దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండటం మీకు ఇష్టం లేదా? ప్రత్యేకించి ఎదుగుతున్న పిల్లల ఆరోగ్యం పట్టదా? కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి లొంగిపోయి నిర్ణయాలు వాయిదా వేస్తున్నారా? కోర్టు ఆదేశాలను తేలిగ్గా తీసుకుంటున్నారా?" అని ధర్మాసనం ఘాటుగా ప్రశ్నించింది. ఇది కోర్టు ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాదని, కోట్ల మంది ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న విషయమని స్పష్టం చేసింది.

**'కుర్‌కురే' ఉదాహరణతో కోర్టు చురకలు**

ఫుడ్ తయారీదారుల వ్యాపార ప్రయోజనాలు ప్రభుత్వ విధానాలను నిర్ణయించలేవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఉత్పత్తులపై స్పష్టమైన లేబుళ్లు ఉంటే వినియోగదారులు కొనుగోలు చేసే ముందు సరైన నిర్ణయం తీసుకోగలుగుతారని తెలిపింది. "మన దేశంలో ఎంతమంది ఎండుద్రాక్షలు (డ్రై ఫ్రూట్స్) కొనగలరు? ఎంతమంది పిల్లలు కుర్‌కురే కొంటున్నారు? అసలు తేడా అక్కడే ఉంది. మేము ఏ ఒక్క ప్రత్యేక ఉత్పత్తికి వ్యతిరేకం కాదు. తాము కొనుగోలు చేస్తున్న ఆహారంలో ఏమేం ఉన్నాయో వినియోగదారుడికి తెలిసేలా చేయడమే మా ఉద్దేశం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హెచ్చరికలు చూశాక కూడా సదరు ఉత్పత్తిని కొనాలా వద్దా అనేది వినియోగదారుడి ఇష్టమని పేర్కొంది.

**భారతీయ ఆహార అలవాట్లపై కేంద్రం వాదన**

కఠినమైన హెచ్చరిక నిబంధనలు అమలు చేస్తే నమ్‌కీన్ వంటి సాంప్రదాయ భారతీయ తినుబండారాలతో పాటు గుడ్డు వంటివాటికి కూడా రెడ్ సింబల్ (హెచ్చరిక గుర్తు) వేయాల్సి వస్తుందని కేంద్రం వాదించింది. పాశ్చాత్య దేశాల ఆహార ప్రమాణాలను నేరుగా భారత్‌కు వర్తింపజేయలేమని అడిషనల్ సోలిసిటర్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. అభివృద్ధి చెందిన దేశాల నాణ్యతా ప్రమాణాలను భారత్ అందుకోలేదనడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. "భారత్‌ను ఎప్పటికీ అభివృద్ధి చెందని దేశంగానే ఉంచాలని అనుకుంటున్నారా? తమ పౌరుల, పిల్లల ఆరోగ్యం పట్ల భారత్ ఎంత తీవ్రంగా ఉందో ప్రపంచానికి తెలియాలి" అని పేర్కొంది.

**'ఇదే ఆఖరి అవకాశం'**

ప్యాకేజ్డ్ ఫుడ్ లేబులింగ్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఏప్రిల్ 2025లో ఇచ్చిన సూచనలపై ఇండియన్ న్యూట్రిషన్ రేటింగ్ ) విధానం ద్వారా 14,000కు పైగా అభిప్రాయాలు వచ్చాయి. అయితే వాటన్నింటిపై ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదని కేంద్రం కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్రానికి, ఎఫ్ఎస్ఎస్ఏఐకి సుప్రీంకోర్టు స్పష్టమైన గడువు విధించింది. "ఇదే మీకు ఇస్తున్న ఆఖరి అవకాశం. తదుపరి విచారణ నాటికి ప్రభుత్వం తన నిర్ణయాన్ని రికార్డుల్లో ఉంచకపోతే, మేమే నేరుగా తీర్పు ఇస్తాం" అని హెచ్చరిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఎస్ఐఆర్ వేగవంతం చేయండి

**నోటీసులు జారీ, విచారణ పూర్తి కావాలి**

**కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి**

**కాలేజీల్లో క్యాంప్‌లు నిర్వహించాలి**

**కలెక్టర్లతో ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్**

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఈవో, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లు, లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, విచారణలు పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. 'బుక్ ఎ కాల్' పెండింగ్ అంశాలు, ఎన్‌జీఎస్పీ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో 'ప్రత్యేక ప్రచార దినాలు' నిర్వహించనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఈ నిర్ణీత ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు (బీఎల్ఏలు) పోలింగ్ కేంద్రాల్లోనే స్వయంగా అందుబాటులో ఉండి పౌరులకు ఓట్ల నమోదు, ఫారమ్‌ల పూర్తిపై మార్గదర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ఈ ప్రక్రియను పారదర్శకంగా ముగించాలన్నారు. 18–19 ఏళ్ల వయసు గల యువ ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, అర్హులైన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో అదనపు, డిప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు. ఆగస్ట 30 వరకు గడువు: 30 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 15 నుంచి జులై 24 మధ్య మీ వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫాంలను బూత్ స్థాయి అధికారులకు ఇంకా సమర్పించ లేదా? తాజాగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేదా? మీ పేరు జాబితాలో ఉన్నా పేరు, వివరాలు, చిరునామాల్లో ఏమైనా తప్పులు, సవరించాలా? లేకుంటే మార్పులు చేయాలా? జాబితాలోని అనర్హుల పేర్లపై అభ్యంతరం చెప్పాలా? వీటిపై దరఖాస్తు చేసుకునేందుకు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు–బీ ఎల్ ఏ లు ఎవరైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఆగస్టు 30 వరకూ సమయం ఇచ్చింది.



## రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం

**పాంగి భగత్ రామ్**

**అరకులోయ: ఆగస్టు 13. జయ జయహే,**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమం అత్యంత ఉత్సాహభరింతంగా సాగుతుంది, అల్లూరి జిల్లా అరకు వేలి మండలం చిన్నలబుడు పంచాయితీ బోడపోదొర్ గ్రామం లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజాలకు అందుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించడం జరిగింది, స్థానిక పంచాయతీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాని నరేంద్ర మోడీ ల సమర్ధ నాయకత్వం లో అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ అభివృద్ధి దూసుకుపోతుందని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో అరకు వేలి మండల క్లస్టర్ కో కన్వీనర్ కిల్లో మోహన్ దాస్, టిడిపి సీనియర్ నేత తాంగుల దొంబురు, బూత్ ఇన్చార్జి స్వాభి సింహాద్రి వంతల మధు కొర్ర కృష్ణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,



## ఆడాకుల భూములను వెబ్‌లైన్లో నమోదుపై ఎమ్మార్వోని వివరాలు అడిగిన అడ్వకేట్ గోవర్ధన్..

**1/70 ఉల్లంఘన జరిగినట్లు తేలితే క్రిమినల్ కేసులకు వెనుకాడము..**

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగస్టు 14,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం ఆడాకుల పంచాయతీలో 36 మంది గిరిజనేతర భూములను వెబ్ లైన్లో నమోదు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు అడ్వకేట్ గోవర్ధన్ గిరి ఆదివాసి సభ్య సంఘాల తరఫున కొయ్యూరు తాసిల్దార్ ప్రసాద్ గారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు ఎమ్మార్వో వివరణ ఇస్తూ కొన్ని సర్వే నెంబర్లు మాత్రమే నమోదు అయ్యాయని గిరిజనేతర్ల పేర్లు ఎవరివి నమోదు కాలేదని మా దగ్గర ఉన్నటువంటి సమాచారం రెండు మూడు రోజులలో అందజేస్తామని తెలియజేశారు ఈ సందర్భంగా అడ్వకేట్ గోవర్ధన గిరి మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ భూభాగంలో సర్వహక్కులు గిరిజనులకు తప్ప గిరిజనేతరులకు ఏ విధమైన హక్కు లేదని చట్టంలో స్పష్టంగా ఉందని1/70 ఉల్లంఘన జరిగినట్లు రుజువైతే సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వెనుకాడబోమని తెలియజేశారు ఈ కార్యక్రమములో పాల్గొనవారు ఆదివాసి జేఏసీ అధ్యక్షులు అశోక్ లాల్. పీసా కమిటీ మండల అధ్యక్షులు దేపూరి రాజు. ప్రకాష్. మరియు బాలల హక్కుల సంరక్షణ జిల్లా కన్వీనర్ రీమెల గంగాధర్.ఇంగువ కుమార్ రాజా. తదితరులు పాల్గొన్నారు...

# సంప్రదాయ శ్రావణ శోభకు స్వాగతం

**శ్రవణ శ్రావణం :-**

పురాణాలు ఇతిహాసాలు భజనలు స్తోత్ర పారాయణులు ఇవన్నీ వినటమే శుభకరమైన శ్రావణం గృహాలలో పచ్చని తోరణాలు రంగురంగుల రంగవల్లికలు కలగలిపే మాసమే శ్రావణమాసం మగువలకు ముచ్చట గొలిపే పుణ్యమాసం శ్రావణమాసం.

**పవిత్రతకు ప్రతీక :-**

అతి ప్రాచీనమైన అనాదికాలం నుండి వస్తున్న సంపద వర్షాకాలపు తొలిచినుకుల సవ్వడి మగువ నూతన గాజుల ఒరవడి. పసుపు నీటి అందం పసుపు గడపల పసుపు పచ్చని పాదాల మురిపం కొత్త కోడళ్ల రాక తో వివిధ రకాలైన రంగురంగుల పట్టు చీరలు పుష్పములు మీరుతూ కన్నెల సంప్రదాయ శోభయే శ్రావణం లోగిలిలో పచ్చని తోరణాలతో మగువల కనకపు ఆభరణములతో శ్రవణాన్ని స్వాగతిద్దాం...

**శ్రావణ మాసపు ముఖ్య పర్వదినాలు:-**

అత్యంత పవిత్ర మాసాలలో శ్రావణమాసం ఒకటి గౌరీదేవికి ఎంతో ప్రీతీదాయకమైన మాసం శ్రావణమాసం ఈ మాసంలో మంగళ వారాలు మరియు శుక్రవారాలు ఎంతో పవిత్రమైనవి.అలాగే శ్రావణ పౌర్ణమి జంధ్యాల పౌర్ణమి అనగా విప్రులు, త్రిసంధ్య దైవ ఆరాధకులు జీర్ణమైన ఉపవీతాన్ని త్యజించి నూతనంగా యజ్ఞోపవీతాన్ని ధరించడం ఈరోజే.. అత్యంత విశేషమైన అన్నాచెల్లెళ్ల బంధంకు ప్రతికైన రోజు రాఖీ పండుగ రోజు ఇది కూడా చాలా అద్భుతమైన రోజుగా జరుపుకుంటాము ఇది కాకా శ్రావణమాసంలో వచ్చే ప్రతి మంగళవారం శుక్రవారం అతిముఖ్యమైనవి. పౌర్ణమి తర్వాత వచ్చే శుక్రవారం అనాదిగా వరలక్ష్మీ వ్రతం చేయడం విశేషం. వరాల నీచే వరలక్ష్మిని పూజించి మనకు కావలసిన సౌభాగ్యాలను పొందడం విశేషం ముత్తైదువలు ఎంతో నియమనిష్టలతో చేసే వ్రతం 11 రకాల పిండి వంటలతో ఇంటిల్లపాది జరుపుకునే ముఖ్యమైన పర్వదినమే శ్రీ వరలక్ష్మి దేవి వ్రతం.

**ఇదే శ్రావణమాసంలో మరొక అతి ముఖ్యమైన పర్వదినం జగద్గురువైన శ్రీకృష్ణ జన్మాష్టమి:-**

శ్రావణ బహుళ అష్టమి రోజున జన్మించిన శ్రీకృష్ణుడు కు మనమందరం జన్మదిన వేడుకలు జరపడం శుభకరం శ్రీకరం పావనము. చెరసాలలో దేవకీమాత ఉదరము లో ఉద్భవించిన మహా తేజోమయమైన గుణ రూప లావన్యుడు మనందరి ఆబాల గోపాల మురిపెపు ముద్దుల బిడ్డ బాలకృష్ణుడు. ఈ బాలకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు మనమందరం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ప్రతి ఏటా ఎన్నో ముచ్చట గొలుపే సాంస్కృతిక వైదిక కార్యక్రమములు జరుపుతూ కృష్ణుడి చరణారవిందంలో మనమందరం నడుద్దాం..

**మగువల కు శ్రావణం ఇచ్చే 5వారాలకు 5ప్రత్యేక కానుకలు:-**

1.సంపద :

సంపద అంటే నగదు నగదు కావు అందరితో కలిసి ఉండడం ఇటువంటి పూజలు నోములు చేసినప్పుడు అందరిని ఇరుగుపొరుగు వారిని పిలిచి వారి ఇంటికి మనం వెళ్లి అందరితో కలిసి మెలిసి చక్కగా నడుచుకోవడం అసలైన సంపద.



2.సౌభాగ్యం :

అందరి కోసం అందరూ వాయినాలు ఇవ్వడం ప్రసాదాలు చూపించుకోవడం ఒకరితో ఒకరు ఆనందమైన అనుభూతులు పాలు పంచుకోవడమే నిజమైన సౌభాగ్యం.

3.సిరి :

అందరూ కలిసి నూతన ఉత్తేజంతో నవ్వుతూ తుళ్లూతూ పులకరింతలతో గడపడమే నిజమైన సిరి.

4.శోభ: మన ఇల్లు చక్కని విధానాలతో అలంకరించుకుని ఉన్న దానిలో ఉన్న విధశీగా తీర్చిదిద్దడమే అసలైన శోభగా స్వీకరించాలి.

5. కనకపు కాసుల రాశి:

కాసు అనగా బంగారంతో లక్ష్మి స్వరూపమని అందరము భావిస్తాను కానీ లక్ష్మీ కాసుల రూపంలో కన్నా మనలో ఉన్న ఆత్మ జ్ఞానశీ చిత్తశుద్ధి అంశాలను ఇష్టపడుతుంది. కనుక కాసుల కోసం ఆరాటపడకుండా లక్ష్మీదేవిని చిత్తశుద్ధితో ప్రసన్న వదనంతో సత్సంకల్పంతో పూజిస్తే ఖచ్చితంగా విలువైన కనకపు కాసుల వర్షాన్ని మన జీవితంలో కురిపిస్తుంది అని భావన.

ఈ మాసంలో మగవలు ఎన్నో విధాలుగా అనేక రకాలైన ఫల పుష్పములతో పూజ చేసి పారాయణం చేసి మంచి మంచి ఆహారాన్ని తయారుచేసి ఇంటిల్ల పాదికి అత్యంత విలువైన పోషకాలతో కూడిన వేడివేడి ఆహారాన్ని శుచిగా శుభ్రంగా ఈ వర్షాకాలంలో ఇవ్వటము... ఈ కాలంలో వచ్చే వ్యాధులను నుండి ఉపశమనం కలిగే విధంగా వ్యాధుల బారిన పడకుండా మంచి తాజా ఆహారాన్ని ఇవ్వడము కూడా ఈ శ్రావణ శోభే...

**రచన**
**ఏ. బాల సౌజన్యకుమారి,**
**తెలుగు ఆచార్యులు,**
**ఆధ్యాత్మికవేత్త,**
**ప్రవచనకర్త**
**నంది అవార్డు గ్రహీత**
**అనకాపల్లి.**



# మారుతున్న ప్రపంచ సమీకరణాలు..

## భారత్ దౌత్యానికి కొత్త పరీక్ష

**(ప్రతాప్)**

ప్రపంచ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. శీతయుద్ధానంతర కాలంలో అమెరికా ఆధిపత్యంగా కనిపించిన అంతర్జాతీయ వ్యవస్థ ఇప్పుడు బహుళధ్రువ ప్రపంచంగా పరివర్తన చెందుతోంది. చైనా ఆర్థిక, సైనిక ఎదుగుదల, రష్యా--పశ్చిమ దేశాల విభేదాలు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న అస్థిరత, వాణిజ్య యుద్ధాలు ప్రపంచ సమీకరణాలను కొత్త మలుపు తిప్పుతున్నాయి. ఈ మార్పుల మధ్య తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ప్రపంచ వ్యవహారాల్లో మరింత ప్రభావవంతమైన పాత్ర పోషించడం భారత్‌కు పెద్ద దౌత్యపరీక్షగా మారింది.

అమెరికా--చైనా పోటీ ఇక సైనిక రంగానికే పరిమితం కాలేదు. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, అరుదైన ఖనిజాలు, 5+--6+ సాంకేతికత, అంతరిక్షం, సైబర్ భద్రత, సరఫరా గొలుసుల వంటి వ్యూహాత్మక రంగాల్లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ పోటీ భారత్‌కు సవాలే కాకుండా అవకాశమూ. ప్రపంచ కంపెనీలు చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్న వేళ, విశ్వసనీయ తయారీ కేంద్రంగా భారత్ ఎదగడానికి ఇది కీలక అవకాశం.

మరోవైపు రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఇంధన, ఆహార, రక్షణ వ్యవస్థలను ప్రభావితం చేస్తోంది. రక్షణ రంగంలో రష్యాపై ఉన్న చారిత్రక ఆధారపడకాన్ని క్రమంగా తగ్గిస్తూ, దేశీయ రక్షణ తయారీతోపాటు అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ తదితర దేశాలతో సాంకేతిక భాగస్వామ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో రష్యాతో ఇంధన, రక్షణ, అంతరిక్ష సహకారాన్ని భారత ప్రయోజనాలకు అనుగుణంగా కొనసాగించడం సున్నితమైన దౌత్య సమతుల్యతను కోరుతోంది.

ఇదే భారత్ అనుసరిస్తున్న బహుళ--అమరిక దౌత్యానికి అసలు పరీక్ష. అమెరికా, రష్యా, యూరప్, గల్ఫ్ దేశాలతో సమాంతరంగా సంబంధాలను బలోపేతం చేస్తూనే, క్వాడ్, బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ వంటి భిన్న వేదికల్లో చురుకైన పాత్ర పోషించడం ద్వారా భారత్ తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటోంది. అయితే ఈ వేదికల మధ్య ప్రయోజన విరోధాలు పెరిగే కొద్దీ ఢిల్లీకి నిర్ణయాలు తీసుకోవడం మరింత సంక్లిష్టం కావచ్చు.




చైనాతో వ్యవహారం మరింత జాగ్రత్తను కోరుతోంది. సరిహద్దు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూనే, వాణిజ్యంలో అతిగా ఆధారపడకుండా సరఫరా వనరులను విస్తరించాలి. అదే సమయంలో ప్రత్యక్ష ఘర్షణ కంటే సంభాషణ, సరిహద్దు నిర్వహణ, ఆర్థిక ప్రయోజనాల మధ్య సమతుల్యత అవసరం. హిందూ మహాసముద్రంలో సముద్ర భద్రత, కీలక సముద్ర మార్గాల రక్షణ కూడా భారత వ్యూహాత్మక ప్రాధాన్యాల్లో ముందుండాలి.

పొరుగు దేశాల పరిణామాలు కూడా అంతే కీలకం. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులు వంటి దేశాల్లో రాజకీయ, ఆర్థిక మార్పులు, బాహ్య శక్తుల పెరుగుతున్న ప్రభావం భారత్ భద్రతా ప్రయోజనాలను ప్రభావితం చేయగలవు. 'పొరుగు దేశాలు మొదట' విధానాన్ని మరింత ఫలప్రదంగా అమలు చేయాలి. రుణ సహాయం మాత్రమే కాకుండా మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్య, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విపత్తు సహాయం వంటి రంగాల్లో వేగంగా స్పందించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలి.

ప్రపంచ దక్షిణ దేశాల గళంగా భారత్ ఎదగాలంటే ప్రకటనలకు మించి ఆచరణాత్మక సహకారం అవసరం. వాతావరణ మార్పు, ఆహార--ఇంధన భద్రత, అభివృద్ధి చెందుతున్న దేశాల అప్పుల భారం, సాంకేతిక అంతరం వంటి సమస్యలపై పరిష్కారాలను ముందుకు తేవాలి. అయితే అంతర్జాతీయ ప్రభావానికి దేశీయ బలమే పునాది. బలమైన ఆర్థిక వ్యవస్థ, ఎగుమతుల విస్తరణ, రక్షణ స్వావలంబన, సాంకేతిక సామర్థ్యం, ఇంధన భద్రత, రాజకీయ స్థిరత్వం లేకుండా బలమైన దౌత్యం సాధ్యం కాదు.

మారుతున్న ప్రపంచంలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండకపోవచ్చు; శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. అందువల్ల భావోద్వేగాలకు అతీతంగా, దేశ ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని, అవసరానికి అనుగుణంగా మారగల దౌత్య వ్యూహమే భారత్‌కు అవసరం. ప్రపంచ శక్తుల మధ్య సమతుల్యత సాధించడమే లక్ష్యం కాకుండా, ఆ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తిగా భారత్ ఎదగాలి. అదే రాబోయే కాలంలో భారత దౌత్య విజయానికి అసలు కొలమానం.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి “నషా ముక్త భారత్” యువజన పోటీలు

**చోడవరం ఆగస్టు 13 జయ జయహే**

మత్తు వీడితేనే యువత భవిష్యత్తు ఉంటుందని చోడవరం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ నాగ కార్తీక్ అన్నారు. మత్తు జీవితాన్ని నాశనం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. గురువారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నష ముక్తభారత్ యువజన పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతంలో లభ్యమవుతున్న గంజాయి రవాణా చేసే క్రమంలో యువత దానికి అలవాటు పడిపోతున్నారుని ఆయన అన్నారు. ఇక్కడ గతంలో రవాణా మాత్రం ఉండేదని ఇప్పుడు వినియోగం కూడా రావడంతో నేరాల సంఖ్య పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సులువుగా వచ్చే ధనం కోసం ఆశపడి యువత గంజాయి రవాణా చేస్తుందని ఆయన ఆవేదన చెందారు. ఆత్మీయ అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువతను సక్రమ మార్గంలో పెట్టేందుకు మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకుని యువత సన్మార్గంలో జీవించాలని పిలుపు నిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి. రత్న భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖపరిధిలోని మేరా యువ భారత్ దేశ వ్యాప్తంగా మాదిగ ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టిందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.ఎస్. అనురాధ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో గంజాయి ప్రభావం అధికంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నషా ముక్తభారత్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు

# మరణానంతరం కూడా బతికే మార్గం అవయవదానం

### కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సతీష్ కుమార్ పెతకంశెట్టి

### అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన

### ఒక్క దానం... అనేక ప్రాణాలకు కొత్త జీవితం

### రక్తం గ్రూపులు వేరైన కిడ్నీ మార్పిడి చేయవచ్చు

**విశాఖపట్నం, ఆగస్టు 13, జయ జయహే**




మనిషి మరణించిన తర్వాత కూడా మరో మనిషి శరీరంలో బతికే అవకాశం కల్పించేది అవయవదానం మాత్రమే... అవ-యవదానం మహాదానం... అది ఎన్నో కుటుంబాల్లో ఆశల దీపంగా వెలుగొందుతుందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సతీష్ కుమార్ పెతకంశెట్టి అన్నారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవయవ మార్పిడి రంగంలో విశాఖ దేశంలోని ప్రధాన వైద్య కేంద్రాలకు ఏమాత్రం తీసిపోకుండా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, జీవనశైలి మార్పులు పెరగడంతో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని తెలిపారు. వేలాది మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తుండగా దాతల కొరత తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. ప్రజలు అవయవదానంపై అవగాహన పెంచుకొని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జీవించి ఉన్నప్పుడు ఒక కిడ్నీని లేదా కాలేయంలోని కొంత భాగాన్ని దానం చేయడం సాధ్యమేనని, అయితే దాత ఆరోగ్య భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ అన్ని వైద్య పరీక్షల అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకుంటామని వివరించారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ కేఎన్ చందన్ కుమార్, డాక్టర్ శశాంక, డాక్టర్ వివేకానందలు మాట్లాడుతూ, సాధారణంగా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరిస్తామని, అయితే సజీవ దాతల నుంచి కాలేయ దానం చేసి ప్రాణాలు కాపాడే అవకాశం కూడా ఉందని తెలిపారు. సమయానికి లివర్ మార్పిడి జరిగితే తీవ్ర కాలేయ వైఫల్యంతో బాధపడుతున్న రోగులు పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడపగలరన్నారు. కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ , ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్లు డాక్టర్ ఆర్ కె. మహేష్, డా. రమ్య వేదుల మాట్లాడుతూ మధుమేహంతో బాధపడుతూ డయాలసిస్‌పై ఆధారపడుతున్న అనేక మంది రోగులు కిడ్నీ మార్పిడి కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారని చెప్పారు. సజీవ దాతల నుంచి కిడ్నీ దానం సురక్షితంగా చేయవచ్చని, ఒకే కిడ్నీతో కూడా సాధారణ జీవితం కొనసాగించవచ్చని వివరించారు. అలాగే రక్తగ్రూపులు వేర్వేరు అయినప్పటికీ ఆధునిక వైద్యసాంకేతికతతో కిమ్స్ ఐకాన్‌లో ఏబిఓ ఇన్‌కాంపాటిబుల్ కిడ్నీ మార్పిడులు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని వల్ల మరింత మందికి మార్పిడి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వైద్యులు మాట్లాడుతూ, మరణానంతరం గుండె, కాలేయం, మూత్రపిండాలు, పాంక్రియాస్, ఊపిరితిత్తులు, కంటి కార్నియా వంటి అనేక అవయవాలు దానం చేయవచ్చని చెప్పారు. ఒక అవయవదాత ఎనిమిది మంది ప్రాణాలను కాపాడగలడు, మరెంతో మందికి చూపును ప్రసాదించగలడు అని వివరించారు. అవయవదానంపై అపోహలు, భయాలు, మతపరమైన సందేహాలను తొలగించేందుకు సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులతో ముందుగానే అవయవదానం గురించి చర్చించి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కిమ్స్ ఐకాన్ వైద్యులు, ట్రాన్స్‌ప్లాంట్ బృంద సభ్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా అవయవదాన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.



# దిశ యాప్ రద్దు మహిళల భద్రతకు విఘాతం

### వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడారి దివ్య కళ

**విశాఖపట్నం, ఆగస్టు 13, జయ జయహే**

మహిళల భద్రత కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌ను రద్దు చేయడాన్ని విశాఖపట్నం జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆడారి దివ్య కళ తీవ్రంగా ఖండించారు. మహిళల రక్షణకు ఉపయోగపడుతున్న దిశ యాప్‌ను రద్దు చేయకుండా మరింత బలోపేతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేందుకు, వారి భద్రతకు త్వరితగతిన స్పందించేందుకు దిశ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 1.51 కోట్ల మంది మహిళలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం దాని పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. “మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన దిశ యాప్‌ను రద్దు చేయడం ఎందుకు? మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో ఉన్న వ్యవస్థను తొలగించడం సరైన నిర్ణయం కాదు” అని ఆమె ప్రశ్నించారు. దిశ యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో మహిళలు పోలీసులను త్వరగా అప్రమత్తం చేయగలిగేవారని, ప్రమాదంలో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఇది ఉపయోగపడేదని ఆమె పేర్కొన్నారు. మహిళల భద్రతకు సంబంధించిన ఇలాంటి సాంకేతిక వ్యవస్థలను మరింత ఆధునీకరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దిశ యాప్ పేరును మార్చి మరో పేరుతో కొత్త యాప్‌ను తీసుకొచ్చినంత మాత్రాన మహిళల భద్రతకు సంబంధించిన అసలు ఉద్దేశం నెరవేరదని ఆడారి దివ్య కళ అన్నారు. “పేరు మార్చడం కాదు.. మహిళలకు భద్రత కల్పించడం ముఖ్యం. దిశ యాప్‌లో ఉన్న సాంకేతిక సదుపాయాలను మరింత మెరుగుపరచి, అత్యవసర సమయంలో మహిళలకు వెంటనే పోలీసు సహాయం అందేలా చేయాలి” అని ఆమె డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆమె కోరారు. మహిళలు ఎక్కడికి వెళ్లినా తమకు ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కలిగేలా భద్రతా చర్యలు ఉండాలని అన్నారు. “దిశ యాప్‌ను రద్దు చేయడం కాదు.. మహిళల భద్రత కోసం దిశగా మరింత బలమైన చర్యలు తీసుకోవాలి. మహిళల రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఆలోచించాలని స్పష్టం చేశారు. దిశ యాప్‌ను రద్దు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, మహిళల భద్రత కోసం దిశ యాప్‌ను కొనసాగించడంతో పాటు మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆమె డిమాండ్ చేశారు.



# కొయ్యూరులో టిడిపి కేడర్ సమావేశం..

### పాడేరు ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 14,**

అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గురువారం కొయ్యూరులో తెలుగుదేశం పార్టీ మండల కేడర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేడర్ తో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత 2 సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈశ్వరి మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.కొమ్మిక నుండి గంగవరం వరకు 4 కి.మీ - 4 కోట్ల 16 లక్షలు,చెల్లాయి నుండి దద్దుగుల వరకు 5.6 కి.మీ - 5 కోట్ల 13 లక్షలు,తుమ్మలబంద నుండి పైడిపనుకుల వరకు 1 కి.మీ - 1 కోటి 41 లక్షలు,కొండసంత నుండి పొర్లబంద వరకు 2 కి.మీ - 2 కోట్ల రూపాయలు,వచ్చింత నుండి ముల్లుమెట్ట వరకు 1 కి.మీ - 1 కోటి రూపాయలు,పోకలపాలెం నుండి పోతవరం వరకు 2 కి.మీ - 2 కోట్ల 70 లక్షలు మంజూరు అయినట్ల తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్లు, సిసి రోడ్లు, మంచినీరు, డ్రైనేజీల నిర్మాణంతో ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా అందిన సాయం గురించి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యాక్రమం లో కాకూరి చంద్రరావు, తోట దొరబాబు, గాం రమాదేవి, బోనంగి సత్యవతి, సుమర్ల సాంబశివ, బండారు సమూర్తి, అది దారకొండ నారాయణమూర్తి, కె. వరలక్ష్మి, రొంగల శ్రీను, గాలి చిన్నారావు, అల్లు బాలరాజు, సుంకర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతలు స్వీకరిస్తున్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి రింగ్ రోడ్ లో గల జనసేన పార్టీ కార్యాలయం లో గురువారం స్థానిక ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించి ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన సంబదిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు సూచించారు ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో మొదటి స్థానం ఏటి కొప్పాక జట్టు

**మునగపాక, ఆగస్టు 13, జయ జయహే:**



మునగపాక గ్రామంలో గ్రామీణ య-ువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన, క్రీడా విభాగం అధ్యక్షులు పెంటకోట విజయ్ సారధ్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు రెండు రోజులు హోరాహోరీగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అండర్ 19 ఇండియా వాలీబాల్ టీం లో ఆడిన ప్రశాంత్, విశాఖపట్నం కి చెందిన ప్లేయర్, నేషనల్ సీనియర్ విభాగానికి చెందిన నేషనల్ ప్లేయర్ ఈస్ట్ గోదావరి శివ హాజరయ్యారు. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ వాలీబాల్ పోటీలలో మొదటి బహుమతి ఎలమంచిలి నియోజకవర్గం ఏటి కొప్పాకకు, రెండవ బహుమతి విశాఖపట్నంకు, మూడో బహుమతి వివిఎస్సి గాజువాక, నాలుగో బహుమతి విజయనగరం శివ జట్టు కైవసం చేసుకున్నారు. ఈ గేమ్స్ నేషనల్ రిఫరీ ఇండియన్ రైల్వే కు సంబంధించిన శ్రీనివాస రావు ఆర్గనైజ్ చేసి ఆడించారు. ఈ ఫైనల్ టీములను ఆర్పీఎఫ్ సి ఐ హరి ప్రభాకర్ పరిచయ కార్యక్రమం చేశారు. క్రీడా విభాగం అధ్యక్షులు పెంటకోట విజయ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని ఈ కార్యక్రమం చేయటానికి ముఖ్య ఉద్దేశం ఇలాంటి ఆటలను చూసి యువత ముందుకు వస్తే స్పోర్ట్స్ కోటాలో మంచి మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ యువజన మందిరం మాజీ అధ్యక్షులు ఆడారి గంగ మహేష్, మల్ల జోగారావు, ఆడారి రాంబాబు, ఆడారి సూర్యచంద్రరావు, దాడి అరుణ్ కుమార్, ఆడారి లక్ష్మణరావు మల్ల రామ జోగి, పెంటకోట జగన్నాథరావు, బుద్ధ నాగు, టెక్కలి అప్పలనాయుడు, మరియు విల్లూరి సోమునాయుడు, గ్రామీణ యోజన మందిరం సభ్యులు, కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రౌండ్ ని ఏర్పాటు చేసిన కె.వి.ఎస్ అప్పారావు, వెలగా శ్రీను, పీవీన్ అప్పారావు, షేక్ రాము, వెలగా జగదీష్, పెంటకోట శ్రీను తదితరులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.



# శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు

**శ్రీసిటీ, ఆగస్టు 13,జయ జయహే.**

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు చెందిన 21 మంది ట్రెయినీ అసిస్టెంట్ కమిషనర్లు తమ అధ్యయనంలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. రాష్ట్ర పన్నుల విభాగం (జీఎస్టీ) జాయింట్ కమిషనర్ మురళీకృష్ణ నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికారు.శ్రీసిటీకి జాతీయ స్థాయి ప్రమాణాల కేంద్రంగా గుర్తింపు లభించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమ పారిశ్రామికవాడ అమలు విధానాన్ని అధికారులు, పాలనా నిపుణులు అధ్యయనం చేయడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. వారితో మా ప్రయాణం, అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీసిటీ అభివృద్ధి ప్రస్థానం, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఇతర ప్రత్యేకతలపై శ్రీసిటీ అధికారులు వారికి సమగ్ర అవగాహన కల్పించారు. ‘మేక్ ఇన్ ఇండియా’, ‘ఆత్మనిర్భర్ భారత్’ కార్యక్రమాల్లో శ్రీసిటీ పోషిస్తున్న కీలక పాత్రను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా పన్నులు, ఎగుమతి సుంకాలు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా జాతీయ ఖజానాకు శ్రీసిటీ అందిస్తున్న గణనీయమైన సహకారాన్ని కూడా వివరించారు. శ్రీసిటీలోని సమగ్ర ప్రణాళిక, అద్భుత మౌలిక వసతులు, సుస్థిర అభివృద్ధి విధానాలను ట్రెయినీ అధికారులు ప్రశంసించారు. పట్టణ మరియు పారిశ్రామిక అభివృద్ధికి అనుసరించదగిన ఒక చక్కని నమూనాగా శ్రీసిటీని వారు అభివర్ణించారు.శ్రీసిటీ అధికారులతో చర్చల అనంతరం, ట్రైనీ అధికారుల బృందం స్థానిక వరుణ్ బెవరేజెస్ (పెప్సికో), బ్లూ స్టార్, బాల్ కార్పొరేషన్ పరిశ్రమల సందర్శించి, అక్కడ అంశాలను తెలుసుకున్నారు.



# ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు సీజ్

**సత్యవేడు, ఆగస్టు 13,జయ జయహే.**

నాగలాపురం మండలం నందనం ఇసుక రీచ్ లో అరుణానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 22 ట్రాక్టర్లను సీజ్ చేశారు.తిరుపతి మైనింగ్ ఏ డి బాలాజీ నాయక్ ట్రాక్టర్లను సీజ్ చేశారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి సిబ్బందితో హైవేపై కాపు కాశారు.అటుగా అనుమతి లేకుండా ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్లను వీఆర్వోలు చంద్రశేఖర్, మహేశ్, పోలీసు సిబ్బంది సహాయంతోసీజ్ చేసి నాగలాపురం ఏ ఎం సి కి తరలించారు. అరుణానది నుంచి ఇసుకను తరలించి పోగుచేసి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.





# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపరిష్కరించాలని వినతి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 13,జయ జయహే.**

పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న రోజువారి పారిశుద్ధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్మికులు మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. రోజువారి కూలీలుగా పనిచేస్తున్న వారిని గుర్తించి వారికి పనిముట్లు చేతి తొడుగులు మాస్కులు బూట్లు సకాలంలో సరఫరా చేయాలని కార్మికులందరికీ పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి తెలిపారు. కార్మికుల సమస్యల పైన ఈనెల 18వ తేదీ కలెక్టరేట్ దగ్గర పెద్ద ఎత్తున కార్మికులను కలుపుకొని ధర్నా కార్యక్రమం చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో, సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటియుసి జిల్లా సబ్ కమిటీ మెంబర్ కత్తి రవి, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లిఖార్జున్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోగిలి హరి, జాన్, కొండమ్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 14న వడ్డాదిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**బుచ్చయ్యపేట,జయ జయహే**



ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం వడ్డాదిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బుచ్చయ్యపేట మండల బిజెపి కార్యదర్శి దొండా నానాజీ తెలిపారు. 200 మీటర్లు పొడవు ఉండే జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.ఈ ర్యాలీలో విద్యార్థులు,అన్ని రాజకీయ పక్షాల నాయకులు,అధికారులు,ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ప్రజలలో దేశభక్తి,జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం





**అనకాపల్లి జయ జయహే**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని అనకాపల్లి రింగురోడ్లో గల ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ లో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి కలెక్టర్ విజయకృష్ణన్ పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బాపూజీ మహాత్మా గాంధీ కి నివాళులు అర్పించడం జరిగింది అనంతరం ఆగస్టు 15 జండా వందనం పురస్కరించుకుని ప్రజలను చైతన్యం చేసేందుకు కూటమి నాయకులు పట్టణ నాలుగు రోడ్లు జంక్షన్ వరకు భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమం ఉద్దేశించి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశం లో 140 కోట్లు పైగా జనాభా కలిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశం మనదే అని ఎంతోమంది మహనీయులు త్యాగాలు పోరాటాలు ప్రాణ త్యాగాలు ఫలితంగానే మన ఈరోజు స్వేచ్ఛ వాయువులను పీలుస్తున్నామని అందుకే స్వాతంత్ర దినోత్సవం కేవలం ఒక పండగ కాదు మన దేశం కోసం త్యాగం చేసిన మహనీయులను స్మరించు కొని ఈ పవిత్రమైన రోజున మన ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపుతో దేశంలో ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరవేయడం ద్వారా మన దేశభక్తిని చాటుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు మన దేశానికి ఉన్న అతిపెద్ద బలం మన యువత ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారతదేశశీ ముందుకు సాగుతోందని అన్నారు స్థానిక పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ మన పూర్వీకులు సాధించిన స్వాతంత్రాన్ని కాపాడుకోవడంతోపాటు భారతదేశము మరింత శక్తివంతమైన అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచే దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి య-ంవకుడు ప్రతి పౌరుడు తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఏపీయుఎఫ్ఐ డి సి చైర్మన్ పీలా గోవిందా సత్యనారాయణ ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రజల చేత దేశ సమగ్రతను సౌభ్రతత్వాన్ని కాపాడతామని అంటూ వారి చేత ప్రతిజ్ఞ చేద్దాం అంటూ వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు తెలుగుదేశం మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ స్థానిక ప్రజలు ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు




## 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం అమలుచేయాలి

### యునైటెడ్ ఫోరమ్ అఫ్ బ్యాంకు యూనియన్

**పొట్టి శ్రీరాములు కూడలి - (జయ జయహే )**

యునైటెడ్ ఫోరమ్ అఫ్ బ్యాంకు యూనియన్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో జాతీయ పిలుపు మేరకు స్థానిక ఇండియన్ బ్యాంక్ పాత బస్టాండ్ ఆవరణలో ధర్నా, నిరసన కార్యక్రమం జరిగింది. యూనియన్ ప్రతినిధులు ఎన్.సీబియూ కె.సిహెచ్ వెంకటరమణ, ఏఐబిఒసి పొన్నాడ కిషోర్ కుమార్, బిఇఎఫ్ఐ మండ.శ్రీనివాసరావులు గురువారం మాట్లాడుతూ 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం ప్రకారం, అమలు చేయవలసిన వారానికి 5 రోజుల పని దినాలని అమలు చేయకపోవడానికి నిరసనగా, 29 కార్మిక చట్టాలను కాలరాచే నాలుగు లేబర్ కోడ్ లకు నిరసనగా ఈ ధర్నా కార్యక్రమం జరుగున్నదని తెలియజేసేరు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ నిరసన ధర్న కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.




## గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు బకాయిలను తక్షణమే చెల్లించాలి

**చోడవరం ఆగస్టు 13 జయజయహే**

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు కార్మికులకు బకాయిలను చెల్లించాలని గత 6 రోజులుగా చోడవరంలో నిరసన దీక్షలు ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ అధ్యక్షత వహిస్తున్నారు. ఈ శిబిరానికి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, లక్షలాదిమంది చెరుకు రైతాంగానికి దశాబ్దాల పాటు జీవనోపాధిని కల్పించిన సహకార రంగ షుగర్ ఫ్యాక్టరీలను పాలకులు అనుసరించిన దోపిడీ విధానాలతో మూసివేశారని, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 23 వేల 450 మంది సభ్యరైతులకు, వెయ్యి మంది కార్మికులకు, ప్రత్యక్షంగా , పరోక్షంగా లక్షలాదిమంది రైతు కూలీలు, స్థానిక ప్రజలు ఆధారపడిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని, 100 కోట్ల రూపాయలు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు భారీ వాగ్దానాలు ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేసి, 2025-26 సీజన్లో ఫ్యాక్టరీకి కనీసపాటి నిధులు కేటాయించకుండా గాలికి వదిలేసారని, 2026-27 సీజన్లో క్రషింగ్ నిలిపివేసి రైతులకు తీరని ద్రోహం చేశారన్నారు. ప్రస్తుతం 2025-26 సీజన్లో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి, చెరుకు తోలిన రైతులకు 29 కోట్లు బకాయిలు చెల్లించకుండా సంవత్సర కాలంగా రైతులు, కార్మికులు, రైతు సంఘాలు ఆందోళన చేస్తున్న పట్టించుకోవట్లేదని, కార్మికులకు జీతాల బకాయిలు, రిటైర్మెంట్ అయ్యి వృద్ధాప్యంలో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల పట్ల కూడా దయ లేకుండా గ్రాట్యుటీ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూతబడిన ఫ్యాక్టరీల ఆస్తులను ప్రైవేటు,కార్పొరేట్ అవసరాలకు మళ్ళించడం కోసం లిక్విడేషన్ పేరుతో ఏపీఐఐసీకి, పిపిపి విధానాలతో ప్రయత్నాలు చేస్తున్నారని, దీనికోసం మంత్రివర్గ ఉపసంఘం నియమించారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని,రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వమే నిధులు కేటాయించి, సహకారరంగ సుగర్ ఫ్యాక్టరీల ఆస్తులను ఉపయోగించాలన్నారుఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు వేగి మహాలక్ష్మి నాయుడు, దాట్ల వెంకటేశ్వరరావు, పల్లి వెంకటరమణమూర్తి, కందిపూడి, చినపాచిల రైతులు కొప్పాక అచ్చింనాయుడు,పోతల వరహాలు, కే శీను బాబు, యు శ్రీను, పి నాని పాల్గొన్నారు.



## "ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ

**చోడవరం ఆగస్టు 13 జయ జయహే**

చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి కాంక్షిస్తూ అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది.రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం మండలంలో గల 76 మంది అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పూర్తయినది. ఈ శిక్షణ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొని అంగన్వాడి కార్యకర్తలకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కెఆర్పిలు సూపర్వైజర్ శాంతి ప్రియ, లక్కవరం స్కూల్ టీచర్ సురేష్, గన్నవరం స్కూల్ టీచర్, గణేష్ , గౌరీపట్నం స్కూల్ టీచర్ ప్రశాంత్ కుమార్ అంగన్వాడీ కార్యకర్తలకు 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల సమగ్రాభివృద్ధి కి అవసరమైన అంశాలు అనగా అంగన్వాడీ పిల్లలకు ఇంగ్లీష్ పరిచయం,అంగన్వాడి కేంద్ర నిర్వహణ, ఆధార్ శీలా, నవచేతన, తల్లిదండ్రులు భాగస్వామ్యం,ఆర్ ఎల్ ఎం, టి ఎల్ ఎం ఏంటి విషయాల గురించి క్లుప్తంగా వివరించారు.

## ఇంటింటి ప్రచారంలో గంటా

**మధురవాడ, ఆగస్ట్ 13:(జయ జయహే)**



జీవీఎంసీ 6 వ వార్డు పరిధిలోని వల్లీ నగర్ లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఇంటింటికి టీడీపీ ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. విధ్వంసంతో వైసీపీ అధోగతిపాలు చేసిన రాష్ట్రాన్ని విజనరీ లీడర్, సీఎం చంద్రబాబు తన పాలనా అనుభవంతో అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలిపారన్నారు. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాల అమలుతో మహిళలకు అండగా నిలిచారని ప్రశంసించారు. స్థానికంగా ఉన్న పశువుల ఆస్పత్రి భవనం పురాతనం కావడంతో శిథిలావస్థకు చేరుకుందని సిబ్బంది గంటా దృష్టికి తీసుకురాగా, ప్రత్యామ్నాయ వసతి కోసం అధికారులతో చర్చిస్తానని చెప్పారు.



## మాడుగులలో జాతీయ జెండా ప్రదర్శన

**మాడుగుల ఆగస్టు 13 జయ జయహే**

భారత జాతీయ 80వ స్వాతంత్ర దినోత్సవ పురస్కరించుకొని ప్రతి ఏడాది వలె ఈ ఏడాది కూడా మాడుగుల లో భారీ జాతీయ జెండా ప్రదర్శన జరిగింది. మన్యం జ్యోతి సేవా సంఘం అధ్యక్షుడు మండల సతీష్ ఆధ్వర్యంలో మాడుగుల బస్టాండ్ నుంచి భారీ పతాకంతో ప్రదర్శన ప్రారంభమై పురవీధుల గుండా తిరిగి బస్టాండ్కు చేరుకుంది. భరతమాతకు జేయంటూ విద్యార్థులు పుర ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, బిజెపి టిడిపి జనసేన వైసిపి పార్టీలకు చెందిన నాయకులు ఏం సంతోషి సుబ్బ లక్ష్మీ,ఎస్ శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ కళావతి,ఏం ఈశ్వరరావు,బి శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరావు,రొబ్బా మహేష్,పి అప్పలనాయుడు,పి మురళి, కె సంతోష్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.



## రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

**అనకాపల్లి జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి గవరపాలెంలో గల రైతు భారతి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి గ్రాఫిలింగు కుస్తీ పోటీలు ఘనంగా ప్రారంభమైంది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాడి రత్నాకర్ పాల్గొని ప్రారంభించడం జరిగింది రాష్ట్రస్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుండి చేసిన కుస్తీ క్రీడాకారులను ఆయన అభినందించడం జరిగింది ఇటీవల జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ లో మొట్టమొదటిసారిగా భారతదేశాన్ని ఛాంపియన్గా నిలిపిన తెలుగు తేజం పీవీ సింధు తెలుగువారకావడం ఎంతో గర్వకారణం అని అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు గత ఏడాది రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్ లో నిర్వహించడం జరిగిందని ఈ ఏడాది అధ్యక్షుడు ఎంబి మాణిక్యాలు సహాయ కార్యదర్శి ఎం సురేందర్ రెడ్డి కృషివలన అనకాపల్లి పట్టణంలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని వారు పేర్కొన్నారు దేశ స్థాయిలో కుస్తీ పోటీలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు పతాకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారని ఈ కుస్తీ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు వారి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్ ఎస్ఓ పూజారి శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోతిర్మయి అంతర్జాతీయ క్రీడాకారిణి ఉమాదేవి మాజీ సైనిక అధికారి రేపాక సత్య కిరణ్ కర్రీ దివాకర్,విల్లూరి రాము, బుద్ధ అప్పలస్వామి నాయుడు, కొణతాల అప్పలనాయుడు, శిలపరిశెట్టి బాబి, ఆళ్ళ ప్రవీణ్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు

## ఫిన్లాండ్ విద్యా వేదికకు.. మల్టీ టాలెంటెడ్ టీచర్ పి.వి.ఎం. నాగజ్యోతి

**చోడవరం ఆగస్టు 13 జయ జయహే**

విద్యాబోధన, క్రీడలు, విద్యార్థుల సమగ్రాభివృద్ధి, సామాజిక సేవ వంటి విభిన్న రంగాల్లో ప్రతిభ చాటుతూ మల్టీ టాలెంటెడ్ టీచర్గా గుర్తింపు పొందిన రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం) పి.వి.ఎం. నాగజ్యోతి మరో ప్రతిష్ఠాత్మక మైలురాయిని చేరుకున్నారు. 2025లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఆమె, తాజాగా ఫిన్లాండ్ విద్యా పర్యటనకు ఎంపికై అంతర్జాతీయ విద్యా వేదికపై అడుగుపెట్టనున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ద్వారా తన బోధనా ప్రతిభను నిరూపించుకున్న నాగజ్యోతి, ఇప్పుడు ఫిన్లాండ్లో విద్యా విధానాలు, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యసన విధానాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అరుదైన అవకాశాన్ని పొందారు. ఆగస్టు 15న ఫిన్లాండ్ పర్యటనకు బయలుదేరి, ఆగస్టు 17 నుంచి 27వ తేదీ వరకు మొత్తం 10 రోజులపాటు ఫిన్లాండ్లోని ప్రతిష్ఠాత్మక తురుకు యూనివర్సిటీ లో నిర్వహించే విద్యా అధ్యయన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అక్కడి విద్యా విధానాలు, బోధనా ప్రక్రియలు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల అభ్యసన వాతావరణం వంటి అంశాలను



సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఆంగ్ల బోధనలో విద్యార్థి కేంద్రిత విధానాలకు ప్రాధాన్యమిస్తూ ఎంతో ఉపయోగకరమైన, ఆకర్షణీయమైన పప్పెట్స్, 3డి మోడల్స్, యానిమేషన్స్, డిజిటల్ కంటెంట్ వంటి ఆధునిక బోధనా సాధనాలను ఆమె సమర్థంగా వినియోగిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, ఫోనెటిక్స్ కాలిగ్రఫీ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ఆమె రూపొందించిన బ్లూమింగ్ ఇంగ్లీష్ ఏ జర్నీ ఆఫ్ జాయ్ ఫుల్ కమ్యూనికేషన్ అనే వినూత్న బోధనా విధానం ఆంగ్ల అభ్యసనాన్ని విద్యార్థులకు మరింత ఆనందదాయకంగా, సహజమైన కమ్యూనికేషన్ ప్రక్రియగా మార్చే లక్ష్యంతో రూపొందింది. ఫిన్లాండ్ పర్యటనలో అక్కడి ఆనందదాయకమైన అభ్యసనం, విద్యార్థి కేంద్రిత బోధన, అనుభవాత్మక అభ్యసనం, సృజనాత్మక విద్యా విధానాలు, సాంకేతిక వినియోగం, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి వంటి అంశాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయనున్నారు. తురుకు యూనివర్సిటీలో పది రోజులపాటు పొందే ఈ అంతర్జాతీయ విద్యా అనుభవాలను తిరిగి రాష్ట్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పంచుకుని, ఆచరణలోకి తీసుకురావాలని నాగజ్యోతి లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు నుంచి ఫిన్లాండ్ అంతర్జాతీయ విద్యా వేదిక వరకు.. పీవీఎం నాగజ్యోతి ప్రయాణం ఒక అవార్డు గెలుపుతో ఆగిపోలేదు. బహుముఖ ప్రతిభను బోధనతో మేళవిస్తూ, ఒక ఉపాధ్యాయురాలు తనను తాను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ అంతర్జాతీయ విద్యా విధానాలను అధ్యయనం చేసే స్థాయికి ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానంగా ఇది నిలుస్తోంది. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అభినందనలు తెలిపి పిన్లాండ్ పర్యటన విజయవంతంగా చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వారపు సంతలో చిరు వ్యాపారుల కష్టాలకు చెక్

## దుకాణ సముదాయాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత

**నక్కపల్లి, ఆగస్టు 13 (జయ జయహే)**

నక్కపల్లి వారపు సంతలో చిరు వ్యాపారుల కష్టాలు తీరాయి. జాతీయ రహదారికి ఆనుకుని ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతలో సుమారు రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పక్కా దుకాణ సముదాయాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. నక్కపల్లి వారపు సంతకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏళ్లుగా వ్యాపారులు పాకలు వేసుకుని కూరగాయలు, కిరాణా సరుకులు, ఎండుచేపలు తదితర వస్తువులను విక్రయిస్తున్నారు. వర్షాకాలంలో సంత ప్రాంగణం బురదమయంగా మారడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత ఏడాది సంభవించిన అగ్ని ప్రమాదంలో సంతలోని పాకలన్నీ దగ్ధమయ్యాయి. దీంతో చిరు వ్యాపారులు హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి పక్కా దుకాణ సముదాయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారుల సమస్యను పరిష్కరించేందుకు మంత్రి చొరవ తీసుకోవడంతో హెటెరో సంస్థ రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులను కేటాయించింది. ఈ నిధులతో మూడు బ్లాకుల్లో మొత్తం 65 దుకాణాలతో పక్కా మార్కెట్ సముదాయాన్ని నిర్మించారు. తాజాగా హోంమంత్రి అనిత ఈ దుకాణ సముదాయాన్ని ప్రారంభించి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. వ్యాపారులు,



కొనుగోలుదారులకు ఈ మార్కెట్ సముదాయం 40 ఏళ్ల కల అని అన్నారు. నక్కపల్లి అతిపెద్ద ఎండుచేపల మార్కెట్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకారులు, వ్యాపారులు నక్కపల్లి సంతకు వచ్చి ఎండుచేపల కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటారని చెప్పారు. సీఎస్ఆర్ నిధులతో మార్కెట్ సముదాయాన్ని నిర్మించేందుకు సహకరించిన హెటెరో యాజమాన్యాన్ని హోంమంత్రి అనిత అభినందించారు.



## చంద్రంపాలెం హైస్కూల్ నెంబర్ వన్‌గా తీర్చి దిద్దుతాం: గంటా

### లోకేష్ చేతుల మీదుగా క్రీడ మైదానం ప్రారంభం

**మధురవాడ, ఆగస్టు 13:( జయ జయహే)**

చంద్రంపాలెం హైస్కూల్ లో సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలో నెంబర్ వన్ గా నెలబెడతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. గురువారం హైస్కూల్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ క్రికెట్, బాస్కెట్ బాల్, వాలీ బాల్ తదితర క్రీడల కోసం దివీస్ సహకారంతో రూ.6.5 కోట్ల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన చంద్రంపాలెం స్కూల్ గ్రౌండ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారన్నారు. బయటనుంచి బ్రహ్మాండంగా కనిపిస్తున్నా.. వాష్ రూం లలో లైట్లు లేవని, పరిసరాల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా బుద్ధులు నేర్పే స్కూల్ దేవాలయంతో సమానమని, సిబ్బంది ప్రతి ఒక్కరూ మన అని బాధ్యతగా పనిచేస్తే తప్ప మెరుగైన ఫలితాలు సాధించలేమన్నారు. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ సౌకర్యాన్ని కల్పించాల్సి ఉందని చెప్పారు. ప్రభుత్వ స్కూల్స్ పట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని, దాన్ని నిలబెట్టుకునేలా టీచర్లు ఉత్తమ ఫలితాలు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. సంఖ్యా పరంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్న చంద్రంపాలెం హైస్కూల్ రెండో స్థానానికి చేరుకోవడానికి గల కారణాలు విశ్లేషిస్తామని వెల్లడించారు. అసాంఘిక శక్తులను కట్టడి చేయడానికి ఏసీపీ, సీఐలకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని చెప్పారు. హైస్కూల్ రక్షణ గోడ ఎత్తు పెంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. సెక్యూరిటీ గార్డులను నియమించే విషయమై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.




## లక్ష్మీపేటలో మంచినీటి, విద్యుత్ దీపాల సమస్యలకు పరిష్కారం

**మాడుగుల, ఆగస్టు 13 జయ జయహే**

భారతీయ జనతా పార్టీ చేపట్టిన అంత్యోదయ మండల పర్యటనలో భాగంగా తాటిపర్తి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపేట గ్రామాన్ని బీజేపీ మాడుగుల మండల అధ్యక్షులు మెలిపాక స్వామి, మండల సర్ ఇంచార్జి న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు, సీనియర్ కార్యకర్తలు పుట్టా నాగేంద్ర, కోన రామకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యతో పాటు విద్యుత్ దీపాల సమస్యను బీజేపీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన నాయకులు సంబంధిత కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, గ్రామంలోని మంచినీటి ట్యాంకును శుభ్రం చేయించి, గ్రామస్తులకు మంచినీరు అందేలా చర్యలు తీసుకున్నారు. గ్రామానికి అవసరమైన విద్యుత్ బల్బులను గ్రామస్తులకు అందజేసి, వాటిని విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో రాత్రివేళల్లో వెలుతురు సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న బీజేపీ నాయకులకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాడుగుల మండల అధ్యక్షులు మెలిపాక స్వామి, న్యాయవాది శ్రీనాథ్ ప్రసాదరావు, పుట్ట నాగేంద్ర, కోన రామకృష్ణ పాల్గొన్నారు. గ్రామానికి అవసరమైన విద్యుత్ బల్బులను న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు సమకూర్చారు. ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే అంత్యోదయ మండల పర్యటన ప్రధాన లక్ష్యం అని బీజేపీ నాయకులు తెలిపారు.



## వరహాల బాబు చెల్లెలు శిరీష చదువు బాధ్యతను స్వీకరించిన మంత్రి అనిత

**నక్కపల్లి, ఆగస్టు 13 :-(జయ జయహే)**

ఇటీవల మృతి చెందిన విద్యార్థి వరహాల బాబు కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. నక్కపల్లిలో వరహాల బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి అనిత, అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరహాల బాబు కుటుంబ సభ్యులకు మంత్రి అనిత ధైర్యం చెప్పారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వరహాల బాబు చెల్లెలు శిరీష చదువు బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు మంత్రి అనిత ప్రకటించారు. శిరీష ఎంతవరకు చదువుకోవాలనుకున్నా, ఆమె చదివించే బాధ్యత తనదేనని మంత్రి అనిత హామీ ఇచ్చారు. శిరీష తన కాళ్లపై తాను నిలబడే వరకు తనకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. వరహాల బాబు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటానని మంత్రి అనిత స్పష్టం చేశారు.




## గౌతు లచ్చన్న జయంతికి ‘బహుజన మాట-పాట’

**రాజమహేంద్రవరం: జయ జయహే ఆగస్టు 13:**

స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ నేత సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా ఈ నెల 16న ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ‘బహుజన మాట--పాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిసి చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. జనగణనలో కుల గణనను చేర్చడం, బిసి లకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం, బిసి రక్షణ చట్టం తీసుకురావడం, స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను 52 శాతానికి పెంచి ఎబిసిడి వర్గీకరణ అమలు చేయడం, మహిళా రిజర్వేషన్లలో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించడం తదితర అంశాలపై సభలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు ఇమంది కన్నారావు మాట్లాడుతూ బిసిలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరగా, బూడిద శరత్ కార్యక్రమానికి బిసి లతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పి. సూర్య చంద్రరావు, పితాని కుటుంబరావు, గుత్తుల కోటేశ్వరరావు, పెంకె శివ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు హాస్యానికి ధృవతార రేలంగికి ఘన నివాళి

**రాజమహేంద్రవరం, జయ జయహే :ఆగస్టు 13:**

తెలుగు సినీ హాస్య జగత్తుకు చిరస్థాయిగా నిలిచిన పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య 116వ జయంతి వేడుకలు గురువారం రాజమహేంద్రవరం గోదావరి గట్టుపై ఉన్న ఆయన కాంస్య విగ్రహం వద్ద గౌడ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, బీసీ జెఎసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైసిపి నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ గుడూరి శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, చల్లా శంకరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ, శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు రెడ్డి రాజు, కార్యదర్శి బుడ్డిగ రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూరంపూడి శ్రీహరి, గెద్దాడ హరిబాబు, మార్గాని చంటిబాబు, రేలంగి శేఖర్, అత్తిలి రాజు సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. రేలంగి తన ఆరోగ్యకరమైన హాస్యంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, హాస్యనటుడిగా పద్మశ్రీ అందుకున్న తొలి నటుడిగా ఆయన తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయుడని కొనియాడారు. రావులపాడులో జన్మించిన రేలంగి ఈ జిల్లా గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గేడి అన్నపూర్ణరాజు, కొండేటి భీమారావు, అప్పారి జయప్రకాశ్, కడియాల రాఘవ, గుత్తుల నాగేశ్వరరావు, పిల్లి వెంకటరమణ, టేకుమూడి బద్రీనాథ్, హరికృష్ణ, మట్టా శ్రీను, యామన నారాయణగౌడ్, నరవ గోపాలకృష్ణ, రేలంగి వీరవెంకట సత్యనారాయణ, వేముల యేసుబాబు, బళ్ల శ్రీనివాస్, వనుము శ్రీనివాస్, దుంగా సురేష్, రుక్కు, శెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## కడియం నర్సరీ రైతులే అభివృద్ధికి జీవనాడి

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 13:**

కడియపులంక గ్రామంలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురుగుమందులు, ఎరువులు, షేడ్ నెట్స్ విక్రయ కేంద్రాలు, వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచానికి ప్రకృతి అందాలను పరిచయం చేస్తున్న కడియం నర్సరీ రైతులే ఈ ప్రాంత అభివృద్ధికి జీవనాడి అని కొనియాడారు. నర్సరీ రైతులకు అవసరమైన పురుగుమందులు, ఎరువులు, పోలీబ్యాగులు, షేడ్ నెట్స్‌ను దళారుల ప్రమేయం లేకుండా తక్కువ ధరలకు అందించేందుకు అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. రైతులకు బ్యాంకుల నుంచి మరింత రుణ సౌకర్యం కల్పించేందుకు త్వరలోనే బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రాజానగరం నుంచి మట్టి రవాణా వ్యయం తగ్గించే చర్యలు తీసుకున్నామని, ‘ పిఎం సూర్యఘర్’ పథకం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలని, నర్సరీలకు సోలార్ మోటార్లు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. కెఎన్ఎ పేరుతో వాటర్ బాటిళ్ల తయారీ ద్వారా కడియం బ్రాండ్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. నర్సరీ కార్మికుల శ్రమ, అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, రైతుల సమస్యలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, కార్యవర్గ సభ్యులు బోడపాటి గోపి, కొండెపూడి రాఘవ, నాగేశ్వరరావు, రత్తయ్య, వరలక్ష్మీనాయుడు, పిల్లా శ్రీనివాస్, శేషుకుమార్, సత్యనారాయణ, రమేశ్, శివన్నారాయణ, గాదె నాగేశ్వరరావు, ప్రవీణ్, ప్రత్యేక అతిథులు మార్గాని సత్యనారాయణ, పుల్లా ఆంజనేయులు, నర్సయ్య, చంటి, గణపతి, గోవింద్, స్థానిక నాయకులు, నర్సరీ రైతులు, అధికారులు పాల్గొన్నారు.



## సిసి రోడ్ నిర్మాణానికి భూమి పూజ

**మునగపాక, ఆగస్టు 13, జయ జయహే:**

మునగపాక మండలం నాగులపల్లి ఎస్సీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో జిల్లా పరిషత్ నిధుల నుండి ఐదు లక్షలు రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగులపల్లి గ్రామంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని ఎస్సీ కాలనీలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి పిఏసిఎస్ పర్సనల్ ఇన్చార్జ్ ఎల్లపు వెంకట భాస్కరరావు, పి రాజి నాయుడు, మాజీ సర్పంచ్ జామి చిన్నమ్మలు, పొలమరశెట్టి నాగు, నాగులపల్లి మాజీ ఉపసర్పంచ్ గోసాల గోవింద్, మొల్లేటి ఆదినారాయణ, మల్ల అప్పలనాయుడు, మైలపల్లి అప్పలనరసం, మైలపల్లి పోతురాజు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!



**తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి.**

చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బంలగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి

**వేలం వెర్రిగా భూముల అమ్మకం**

**ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ**

**హైదరాబాద్ (జయ జయహే)**



రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మధ్య ఆటల పోటీలు

**శ్రీకాకుళం పట్టణం. (జయ జయహే)**




శ్రీకాకుళం పట్టణంలో గల జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పురుష, మహిళా, న్యాయవాదులకు, శ్రీకాకుళం కోర్టు ప్రాంగణంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు అనేక రకమైనటువంటి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూన. రాజారావు, జనరల్ సెక్రెటరీ చిట్టి. సూర్యనారాయణ పత్రికా ప్రతినిధులకు ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. ఈసారి క్రీడలు పోటీలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా సీనియర్, జూనియర్ న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి ప్రత్యేక అభినందనలని, ముఖ్యంగా కబడ్డీ పోటీలను సమర్ధవంతంగా నిర్వహించిన సీనియర్ న్యాయవాది అయిన సనపల. హరి, ఆటల పోటీలను దగ్గరుండి పర్యవేక్షించిన సీనియర్ న్యాయవాదులైన డి. పార్థసారథి, ఎస్ .రత్నాకర్, ఏ.ప్రకాష్ , జూనియర్ న్యాయవాదైన పైడి. సాయి ప్రత్యేకంగా అభినందించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు, ఆగస్టు 15న శ్రీకాకుళం పట్టణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు జండా వందన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు, అనంతరం జనరల్ సెక్రెటరీ చిట్టి .సూర్యనారాయణ తన సొంత ఖర్చులతో ఉదయం న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న గౌరవ న్యాయమూర్తులకు అందరికీ ప్రత్యేక ఆహ్వానం పలికారు




## తిరువట్టం గ్రామంలో జయమ్మ మృతి

**ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్సీపీ కార్యదర్శి**

**టీ రాకేష్ కిరణ్ పరామర్శ.**

**సత్యవేడు, ఆగస్టు 13,జయ జయహే**

రిటైర్డ్ జిల్లా జడ్జ్ దొరస్వామి ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యదర్శి టి. రాకేష్ కిరణ్ పార్టీ ముఖ్య నాయకులు గురువారం నారాయణవనం మండలం తిరువట్టం గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన జయమ్మ మృతి చెందడంతో, ఆమె భౌతికకాయానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం జయమ్మ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఆర్థిక సహాయం అందించారు. కష్టసమయంలో పార్టీ తరపున కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్‌డీఎస్‌ఎస్ పనుల పురోగతిపై కేంద్ర విద్యుత్ అధికారులు సమీక్ష

**విశాఖపట్నం, ఆగస్టు 13, జయ జయహే**

భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శశాంక్ మిశ్రా, డైరెక్టర్ ప్రణవ్ తాయల్ గురువారం విశాఖ సాగర్‌నగర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమ్ కింద చేపడుతున్న పనులు, భూగర్భ విద్యుత్ కేబులింగ్, స్మార్ట్ మీటరింగ్, ఐటీ ఆధారిత విద్యుత్ సేవలు, ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులు స్కాడా నియంత్రణ కేంద్రాన్ని సందర్శించి, విద్యుత్ పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తున్న విధానం, సాంకేతిక సేవల నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై వివరాలను పరిశీలించారు. అలాగే విశాలాక్షి నగర్‌లో ఆర్ డి ఎస్ ఎస్ లో భాగంగా చేపడుతున్న భూగర్భ విద్యుత్ కేబులింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి. వనజ, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి. సూర్యప్రకాష్, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్. హరిబాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు బి. అశోక్ కుమార్, వి. విజయలలిత, పి. సాల్మన్ రాజు, డి. సుమన్ కళ్యాణి, ఎల్. మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.




## మధుమేహం ఒక దీర్ఘకాలిక వ్యాధి

**షుగర్ లెవల్స్ అదుపు చేయడానికి వ్యాయామం, డైట్ తప్పనిసరి**

**భీమవరంలో మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులకు ఉచిత షుగర్ పరీక్షలు**

**భీమవరం ; (జయ జయహే )**

అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా అనేక వ్యాధులు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని, వ్యాధులను సకాలంలో గుర్తిస్తే మీ భవిష్యత్తులో ఎదురయ్యే అవాంఛనీయ పరిస్థితులను నివారించవచ్చునని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ అండ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కనగర్ల కిషోర్ అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులకు తాడిమళ్ల కాంప్లెక్స్ వద్ద భీమవరంలోని శ్రీ సోమేశ్వర మెడికల్ డిస్ట్రిబ్యూటర్ మేనేజింగ్ డైరెక్టర్, క్లబ్ సభ్యులు కనగర్ల కిషోర్ సహకారంతో ఉచిత షుగర్ టెస్టులను నిర్వహించారు. కొత్త శ్రీనివాస్,కారుమూరి సత్యనారాయణ, రేపాక మణి మోహన్ రావు మాట్లాడుతూ ఈ రోజుల్లో చాలా మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని, రక్తంలో షుగర్ లెవల్స్ అదుపు చేయడానికి వ్యాయామం సరైన డైట్ తప్పనిసరి అని అన్నారు. కురుశెట్టి శ్రీనివాస అప్పారావు, మానేపల్లి వెంకన్నబాబు, బొండాడ బంగార్రాజు మాట్లాడుతూ మధుమేహం (డయాబెటిస్) ఒక దీర్ఘకాలిక వ్యాధి అని, కొన్ని సులభమైన అలవాట్లు కూడా డయాబెటిస్ నియంత్రణకు తోడ్పడతాయన్నారు.గుండు సుమూర్తి,సంకా బాబు,పులవర్తి రామకృష్ణ మాట్లాడుతూ రోజుకు కనీసం 30 నిమిషాల వాకింగ్, యోగా లేదా ఇతర వ్యాయామాలు చేయడం వల్ల ఇన్సులిన్ పనితీరు మెరుగుపడి, రక్తంలో చక్కెర నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బొండా హనుమంతరావు, బాయ్స్ శ్రీనివాస్, పున్నాని కనకరావు, కంచర్ల భాస్కరరావు,సభ్యులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com